సాక్షి
మహబూబ్‌నగర్
శనివారం, 6, జూలై, 2024



**వైభవంగా ఆరుద్రోత్సవం**

బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్రోత్సవం వైభవంగా నిర్వహించారు.

వివరాలు 8లో ▸



**కురుమూర్తి కిటకిట**

అమావాస్య నేపథ్యంలో కురుమూర్తిస్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.4 /24.8

**వాతావరణం**

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రివేళలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### మోస్తరు వర్షం



**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** జిల్లాకేంద్రంలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మోస్తరు వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఓపెన్ నాలాలతోపాటు గల్లీల్లోని మోరీలు పొంగిపొర్లాయి. కాగా, జడ్చర్ల–రాయచూర్ ప్రధాన రహదారిపై ముఖ్య కూడళ్లలో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. వర్షం కురుస్తున్నప్పుడు బైక్‌లతోపాటు కార్లు, ఇతర వాహనాలు రోడ్లపై నెమ్మదిగా ఆగి వెళ్లాల్సి వచ్చింది. కొందరు వ్యక్తులు తమ పనుల కోసం బయటకు వచ్చి వర్షంలో అలాగే తడిసి ముద్దయ్యారు. మున్సిపాలిటీ విలీన గ్రామాల్లో మట్టిరోడ్లన్నీ చిత్తడిగా మారాయి. బురదతో పాటు మురుగు రోడ్లపైకి రావడంతో ప్రజలు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన



**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో వినియోగదారుల పరిరక్షణ చట్టం– 2019పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రతిఒక్కరు వినియోగదారుల చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కల్తీ వస్తువులు, నూనెలు, వస్తువుల కొనుగోలుపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో జరిగే వ్యాపారాలపై అప్రమత్తంగా ఉండాలని, మోసాలపై జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ నాగలక్ష్మి, కోఆర్డినేటర్ లావణ్య, వాసంతి, మద్దిలేటి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

### బదిలీలు, పదోన్నతులపై విచారణ జరపాలి

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** విద్యాశాఖలో జరిగిన బదిలీలు, పదోన్నతుల్లో జరిగిన అక్రమాలపై వెంటనే విచారణ జరిపించాలని టీపీఆర్టీయూ నాయకులు కలెక్టర్ విజయేందిరకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, కార్యదర్శి రమాకాంత్ ప్రసాద్ మాట్లాడుతూ పదేళ్ల తర్వాత ప్రభుత్వం బదిలీలు, పదోన్నతులు ఇస్తున్న క్రమంలో విద్యా శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పైరవీలతో అర్హులకు అన్యాయం చేశారన్నారు. కొందరు ఉపాధ్యాయులు హెచ్‌ఆర్‌ఏ ప్లేస్ కోసం నిబంధనలు ఉల్లంఘించి బదిలీ చేయించుకున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతుల్లో 10, 15 శాతం కోటా ప్రకారం ఇవ్వాల్సి ఉండగా కొన్ని పాఠశాలల్లో సీనియర్, జూనియర్, దివ్యాంగులకు వినహాయింపు ఉండగా తెలుగుగూడెం పాఠశాలలో దివ్యాంగురాలిని రిలీవ్ చేశారని ఆరోపించారు. ఎస్టీ కేటగిరిలో అంజలిదేవి అనే ఉపాధ్యాయురాలు అర్హురాలిగా ఉన్నా సీనియార్టీ జాబితాలో పేరు చేర్చకపోవడంతో ఆమె పదోన్నతి కోల్పోయిందన్నారు. ఎస్‌ఏ తెలుగు ఓ దివ్యాంగ ఉపాధ్యాయురాలికి సదరు కోటాలో ప్రమోషన్ కల్పించాలని, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి అయ్యాక, ఆమె పేరును కమిటీలో ఉన్న ఓ వ్యక్తి తొలగించారన్నారు. కమిటీలో కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పు చేస్తున్నారని, వారిని తప్పించాలని డీఈఓకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. వీటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు.

పై'చేయి' కోసం..

# కాంగ్రెస్‌లో 'కాక'



గాంధీభవన్ వద్ద ధర్నా చేస్తున్న సరిత వర్గీయులు

- 'చేయి' అందుకోనున్న గద్వాల ఎమ్మెల్యే
- తాజా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత వర్గంలో కలవరం
- చేర్చుకోవద్దంటూ ఇప్పటికే ఎంపీ మల్లు రవికి విజ్ఞప్తి
- తాజాగా నిరసనలు ఉధృతం చేసిన ఆమె వర్గీయులు
- గాంధీభవన్‌కు చేరిన లొల్లి.. హాట్‌టాపిక్‌గా నడిగడ్డ రాజకీయాలు
- నేడు సీఎం సమక్షంలో 'హస్తం' గూటికి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



సరిత



కృష్ణమోహన్‌రెడ్డి

**సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:** బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, సరిత.. ఒకరు గద్వాల ఎమ్మెల్యే, మరొకరు అదే జిల్లాకు జెడ్పీ చైర్‌పర్సన్.. వారు అసలే ఉప్పు, నిప్పు. బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పుడు వారి మధ్య నువ్వా, నేనా అన్నట్లు ఆధిపత్య పోరు నడిచింది. పచ్చగడ్డి వేస్తే భగ్గు మనేలా ఇరువురి మధ్య వైరం తారస్థాయికి చేరింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడిన సరిత కారు దిగి కాంగ్రెస్‌లో చేరారు. హస్తం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆమె బీఆర్‌ఎస్ అభ్యర్థి కృష్ణమోహన్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ జిల్లాలో జెడ్పీ చైర్‌పర్సన్‌గా చక్రం తిప్పుతూ వచ్చారు. అయితే తాజా రాజకీయ పరిణామాలు ఆమెను కలవరపాటుకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే హస్తం గూటికి చేరనున్నట్లు జరుగుతున్న ప్రచారం ఆమె వర్గీయులను ఆందోళనకు గురిచేస్తోంది. కృష్ణమోహన్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దంటూ సరిత అనుచరులు, అభిమానులు ఆందోళనకు దిగుతుండడం.. ఇదే సమయంలో బండ్ల వేస్తున్న అడుగులు హాట్‌టాపిక్‌గా మారగా.. ఎవరు ఏం చేసినా పై'చేయి' కోసమేనంటూ రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.

### బుజ్జగింపు యత్నాలు షురూ..

కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడాన్ని వ్యతిరేకిస్తున్న సరితను బుజ్జగించేందుకు కాంగ్రెస్ పెద్దలు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ మేరకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఆయన సరితతో సుదీర్ఘంగా చర్చించారని.. జెడ్పీ పదవీకాలం ముగిసినందున ఆమెకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఇంతటితో నైనా ఈ ఎపిసోడ్‌కు ముగింపు పలుకుతారా.. లేక ఇంకా కొనసాగనుందా.. రాజకీయ పరిణామాలు మారనున్నాయా అనేది వేచి చూడాల్సిందే.

### ఎవరి 'దారి' వారిదే..

ఒక వైపు కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దంటూ సరిత వర్గీయుల ఆందోళనలు.. మరోవైపు హస్తం గూటికి చేరేలా బండ్ల అడుగులు నడిగడ్డ రాజకీయాలను వేడెక్కించాయి. కృష్ణమోహన్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దంటూ ఆమె వర్గానికి చెందిన అనుచరులు ఆందోళనలను ఉధృతం చేశారు. నియోజకవర్గంలోని గద్వాల మున్సిపాలిటీతో పాటు కేటీదొడ్డి, మల్దకల్, గట్టు మండలాల్లోని పలు ప్రాంతాల్లో సరిత వర్గానికి చెందిన నాయకులు గురువారం ధర్నాలకు దిగారు. కృష్ణమోహన్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని.. సరితకు అన్యాయం చేస్తే సహించేది లేదంటూ గద్వాల పట్టణంలోని రాజీవ్‌మార్గ్‌లో ఓ వ్యక్తి సెల్‌టవర్ ఎక్కి ఆందోళన చేపట్టగా.. మరొకరు పెట్రోల్ బాటిల్‌తో హల్‌చల్ చేశారు. తాజాగా శుక్రవారం సరిత అనుచరులు, అభిమానులు భారీగా హైదరాబాద్ తరలి వెళ్లి గాంధీభవన్‌ఎదుట ఆందోళనకు దిగారు. మరోవైపు ఇవేమీ పట్టించుకోకుండా బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తన కార్యకర్తలతో భేటీలు నిర్వహిస్తూ అభిప్రాయాలను సేకరిస్తుండడం.. వారు కాంగ్రెస్‌లో చేరాల్సిందేనంటూ పట్టుబట్టడం వంటి నాటకీయ పరిణామాలతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

### 'పట్టు' కోసమే..

గద్వాల నియోజకవర్గంలో పట్టు నిలుపుకునేందుకు కృష్ణమోహన్‌రెడ్డి, పట్టు సాధించేందుకు సరిత తొలి నుంచీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరులోని 14 నియోజకవర్గాల్లో గద్వాల, అలంపూర్ మినహా మిగిలిన 12 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. రాష్ట్రంలో సైతం అధికారాన్ని చేజిక్కించుకుంది. గద్వాలలో కాంగ్రెస్ అభ్యర్థి సరిత ఓటమి పాలైనప్పటికీ రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలో ఉండడం.. ప్రొటోకాల్ ప్రకారం జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఆమెకే ప్రాధాన్యం లభిస్తుండడం ఎమ్మెల్యే బండ్ల వర్గీయుల్లో నిరుత్సాహం అలుముకుంది. ఈ క్రమంలో రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను బలహీన పరిచేందుకు కాంగ్రెస్ అధిష్టానం వ్యూహాత్మకంగా అడుగులు వేయడం.. ఈ మేరకు గద్వాల ఎమ్మెల్యేతో మంత్రి జూపల్లి సమావేశం కావడం మలుపులకు దారితీసింది. రాజకీయ భవిష్యత్‌తో పాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం హస్తం గూటికి చేరాలని కృష్ణమోహన్‌రెడ్డి వర్గీయులు ఇదివరకే ఆయనపై ఒత్తిళ్లు తెస్తుండడంతో కొన్నాళ్లు వేచిచూద్దామని భావించారు. ఎప్పుడైతే తనకున్న సాన్నిహిత్యం మేరకు ఎమ్మెల్యేతో మంత్రి జూపల్లి భేటీ కాగా.. హస్తంలో చేరికకు అప్పుడే మార్గం సుగమమైనట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్ పాలక వర్గాల పదవీ కాలం ముగిసేవరకు వేచిచూసిన ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రులు జూపల్లి, దామోదర రాజనర్సింహ నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఉమ్మడి పాలమూరుకు చెందిన ఎమ్మెల్యేలతో కలిసి ఆయన పాల్గొనడం కాంగ్రెస్‌లో చేరిక ఖాయమని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

### నేడు సీఎం సమక్షంలో చేరిక..

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఇటీవల బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలతో పాటు తన అభిమానులతో వరుసగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో కృష్ణమోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరాలని మంత్రి జూపల్లి సంప్రదించిన మాట వాస్తవమేనని.. తమ నాయకులు, కార్యకర్తల నుంచి సైతం ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. ప్రజాభిప్రాయం మేరకు నడుచుకుంటానని వెల్లడించారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే సీఎం రేవంత్‌రెడ్డి నుంచి ఆయనకు పిలుపు అందగా.. చేరిక ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

# టూరిజం హబ్‌గా నల్లమల



మన్ననూర్‌లో మొక్కలు నాటిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో మంత్రి దామోదర రాజనరసింహ, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, వంశీకృష్ణ, వాకిటి శ్రీహరి, రాజేష్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డి, కలెక్టర్ బి.సంతోష్ తదితరులు

- పర్యాటక రంగం అభివృద్ధితోపాటు యువతకు ఉపాధి కల్పిస్తాం
- ఉమామహేశ్వరం ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు
- స్టడీ టూర్‌లో మంత్రులు దామోదర రాజనరసింహ, జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు

**అచ్చంపేట/ మన్ననూర్:** నల్లమలను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, పర్యాటక, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం శ్రీశైలం ఉత్తరద్వారమైన ఉమామహేశ్వర ఆలయం, రంగాపూర్ నిరంజన్ షావలీ దర్గాలో మంత్రులతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల బృందం ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. అనంతరం మన్ననూర్ చింతల చెరువు రెవెన్యూ భూమిలో 75వ వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. తిరిగి ఫర్హాబాద్ నుంచి వ్యూ పాయింట్, భౌరాపూర్ పెంట వరకు జంగల్ సఫారీ వాహనంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యాటక రంగం అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా పర్యాటక శాఖ కృషి చేస్తోందన్నారు. శైవక్షేత్రాలు, జంతుజాలానికి నిలయమైన నల్లమల అటవీ ప్రాంతానికి దేశ, విదేశీయులను రప్పించేలా ఎకో టూరిజంను అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో పర్యాటక రంగానికి కావాల్సిన వనరులు ఉన్నాయని వీటిని సద్వినియోగం చేసుకొనే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని వెల్లడించారు. టూరిజం, అటవీశాఖ సంయుక్తంగా పీసీసీ పద్ధతిలో పర్యాటకంగా ఆదాయం పెంచేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వివరించారు. అడవులను సంరక్షిస్తూ వాటిలోని అందాలను ప్రకృతి ప్రేమికులు ఆస్వాదించేలా తీర్చిదిద్దుతామన్నారు. ఈ క్రమంలోనే ఉమామహేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. శ్రీశైలం– మహబూబ్‌నగర్ రహదారిలో ఆకర్షణీయమైన సైట్ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందేలా ప్రతి జిల్లాను నెలకోసారి సందర్శించి పర్యాటక పరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి ఆరా తీస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, జి.మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియల్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్‌రెడ్డి, పురావస్తు శాఖ డైరెక్టర్ భారతి హోళికేరి పర్యాటక శాఖ డైరెక్టర్ ఇల త్రిపాఠి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్, డీఎఫ్‌ఓ రోహిత్‌గోపిడీ, గోపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వారికి నిబంధనలు వర్తించవా?

నల్లమలను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా శుక్రవారం మంత్రులు దామోదర రాజనరసింహ, జూపల్లి కృష్ణారావుతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు స్టడీ టూర్ నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటక ప్రాంతాల పరిశీలనతో పాటు సఫారీ టూర్ కోసం అభయారణ్యంలోకి ప్రవేశించారు. అయితే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులను మాత్రం అనుమతించకపోవడం గమనార్హం. సాధారణంగా జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు వన్యప్రాణులు జతకట్టే సమయంగా అటవీ శాఖ గుర్తించింది. ఈ క్రమంలో వన్యప్రాణుల స్వేచ్ఛకు భంగం కలగకుండా ఉండేందుకు ఈ మూడు నెలలు అభయారణ్యంలో ఎలాంటి జనసంచారం ఉండకూడదు. కానీ, మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు లెక్కకు మించి వారి అనుచర గణం అడవిలోకి వెళ్లినా అధికారులు అడ్డు చెప్పకపోవడంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం వార్తల కవరేజీ కోసం జర్నలిస్టులను కూడా అనుమతించకపోవడం ఆశ్చర్యంగా ఉందని పలువురు ముక్కున వేలు వేసుకున్నారు.



ఉమామహేశ్వరస్వామికి పూజలు చేస్తున్న మంత్రి దామోదర రాజ నరసింహ, ఎమ్మెల్యేలు

## స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టిపెట్టాలి



మొక్క నాటుతున్న ఎంపీ డీకే అరుణ

**పాలమూరు:** పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను పరిగణలోకి తీసుకుని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టిసారించాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై అసెంబ్లీల వారీగా ముఖ్య నాయకులతో శుక్రవారం ఆమె పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఉన్న లోటుపాట్లు, అనుకూలతలు ఇతర కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు వైషమ్యాలు పక్కనపెట్టాలని, నాయకులు, కార్యకర్తలు అంతా కలిసి పని చేయాలని సూచించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో డీకే అరుణ మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. గ్రీన్ మహబూబ్‌నగర్ లక్ష్య సాధనకు పాలమూరు ప్రజలు సహకరించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత ఎంపీ డీకే అరుణ జిల్లాకేంద్రంలోని కాటన్ మిల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

### సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కొత్వాల్



**స్టేషన్ మహబూబ్‌నగర్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో శుక్రవారం రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మైనార్టీ కార్పొరేషన్ ద్వారా చేపట్టనున్న కార్యక్రమాల గురించి సీఎంతో చర్చించారు. ఫైనాన్స్ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించినందుకు సీఎంకు కొత్వాల్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమానికి ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతామన్నారు.

## జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఫలితాలు విడుదల

- రాష్ట్రస్థాయి ఎంపికలకు 21 మంది విద్యార్థులు
- 11, 12 తేదీల్లో హకీంపేటలో సెలక్షన్స్



జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి సెలక్షన్స్ (ఫైల్)

**మహబూబ్‌నగర్ క్రీడలు:** రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో గత నెల 28న నిర్వహించిన జిల్లాస్థాయి స్పోర్ట్స్ సెలక్షన్ ఫలితాలను శుక్రవారం జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్ ప్రకటించారు. రాష్ట్రస్థాయి సెలక్షన్‌కు సంబంధించి 4వ తరగతిలో ప్రవేశాల కోసం 21 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, ఇందులో 13 మంది బాలురు, 8 మంది బాలికలు ఉన్నారన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు హైదరాబాద్‌లోని హకీంపేటలో ఈ నెల 11, 12 తేదీల్లో రాష్ట్రస్థాయి సెలక్షన్స్ ఉంటాయన్నారు.

■ రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌కు జిల్లాస్థాయిలో ఎంపికైన బాల, బాలికలు 10 పాస్ పోర్ట్ ఫొటోలు, పాఠశాల, మున్సిపాలిటీ లేదా తహసీల్దార్ కార్యాలయం నుంచి జనన ధ్రువీకరణ పత్రం, ప్రస్తుత పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, ఆధార్ కార్డు, కమ్యూనిటీ సర్టిఫికెట్‌తో ఎంపికల్లో పాల్గొనాలని డీవైఎస్‌ఓ సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

**ఎంపికైన బాల, బాలికల వివరాలు..**

ఎస్.నందకిషోర్ (మహబూబ్‌నగర్), ఎం.నేహాన్ సాయి (మిడ్జిల్), ఎల్విన్ స్టిఫిఎన్ (మహబూబ్‌నగర్), విఘ్నేష్‌కుమార్ సాయి (టంకర, హన్వాడ), ఎ.రోహిత్ (పాతమొల్గర, భూత్పూర్), జి.సాత్విక్ (బాలానగర్), వి.శశికపూర్ (వెంకటాపూర్, మహబూబ్‌నగర్), సుశాంత్‌నాయక్, అఖిల్ నాయక్, చరణ్‌నాయక్ (చిన్నచింతకుంట), తేజస్ నాయక్ (జడ్చర్ల), కె.సునీల్, సిద్దు (మహబూబ్‌నగర్) ఎంపికయ్యారు. బాలికలలో జానివ్యశ్రీ, శ్రీవిద్య (మహబూబ్‌నగర్), ఎం.సాయికీర్తి (చిన్నచింతకుంట), పి.వేదశ్రీ (అడ్డాకుల), జె.సుహాని (బాలానగర్), కల్పన (జడ్చర్ల), నవ్యశ్రీ (బాలానగర్), కె.రాధ (జడ్చర్ల) ఉన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** డెంగీ, మలేరియా, విష జ్వరాలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. 'డ్రై డే'లో భాగంగా శుక్రవారం జిల్లాకేంద్రం 42వ వార్డు పరిధిలోని జగ్జీవన్‌రాంనగర్‌లో డ్రెయినేజీలు, ఇంటింటా పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్, స్ప్రే నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటి ఆవరణలో, రోడ్లపై చెత్తాచెదారం వేయొద్దని ప్రజలకు సూచించారు. ఇళ్లలో ఉన్న కూలర్లు, పూలకుండీలు, టైర్లు, కొబ్బరిబొండాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. అలాగే చెత్త సేకరణకు మున్సిపల్ వాహనం సరిగా వస్తుందా.. లేదా.. అని ఆరా తీశారు. అనంతరం కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించి లైటింగ్, డోర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్ రామలక్ష్మణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురులింగం తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రాంనగర్‌లో డ్రెయినేజీని శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డికి సూచిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

### ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్

**జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్):** జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ విజయేందిర జెడ్పీ చాంబర్‌లో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు జెడ్పీసీఈఓ రాఘవేంద్రరావు, డిప్యూటీ సీఈఓ ముశాయిదాబేగం, పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆమెకు స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉద్యోగులు సమయ పాలన పాటించాలని, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని కోరారు. అనంతరం జెడ్పీ సూపరింటెండెంట్లు శ్రీహరి, ఆనంద్, విజయ్, ఉద్యోగులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## హోరాహోరీగా..

- ఉత్కంఠగా సాగిన సింగిల్స్, డబుల్స్ సెమీస్ మ్యాచ్‌లు
- నేడు ముగియనున్న టోర్నీ

- వివరాలు 8లో..

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

పెబ్బేరు రూరల్: బైక్, బొలెరో వాహనం ఢీకొని ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం సాయంత్రం వనపర్తి మండలం నాగవరం శివారు భారత్ పెట్రోల్‌పంపు సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి కథనం మేరకు.. కొత్తకోట మండలం పామాపురం గ్రామానికి చెందిన సంద మహేష్ (35), అదే గ్రామానికి చెందిన కుమ్మరి సాయిబాబా పిల్లల పుస్తకాల కొనుగోలుకు బైక్‌పై కొత్తకోట నుంచి వనపర్తికి బయలుదేరారు. మార్గమధ్యంలో నాగవరం శివారు భారత్ పెట్రోల్‌పంపు దగ్గరకు రాగానే వనపర్తి నుంచి వస్తున్న బొలెరో వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంద మహేష్ అక్కడికక్కడే మృతిచెందగా.. కుమ్మరి సాయిబాబాకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మహేష్ భార్య సంద మాధవి ఫిర్యాదు మేరకు బొలెరో వాహనం డ్రైవరుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్‌ఐ వివరించారు.

### టిప్పర్ ఢీకొని వ్యక్తి..



రాజాపూర్ (బాలానగర్): బతుదెరువుకు పొట్టచేత పట్టుకుని రాష్ట్రాన్ని వదిలి వచ్చి, ఓ పరిశ్రమలో సెక్యూరిటీగా పనిచేస్తూ.. పరిశ్రమలోకి వస్తున్న టిప్పర్ ఢీకొని వ్యక్తి మృత్యువాత పడిన సంఘటన మండల పరిధిలోని బోడజానంపేట్ గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. బాలానగర్ ఎస్‌ఐ తిరుపాజి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన లాలు(50) కొన్ని నెలల కిందట ఓ పరిశ్రమలో సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున పరిశ్రమలోకి వస్తున్న టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని అజాగ్రతతో నడిపి పరిశ్రమ గేటును ఢీకొట్టాడు. గేటు వద్దే లాలు ఉండటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

### దైవదర్శనానికి వెళ్తుండగా..

అయిజ: నవ దంపతులు దైవదర్శనం చేసుకునేందుకు బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితుల బంధువులు తెలిపిన వివరాలు ఇలా.. అయిజ పట్టణానికి చెందిన ప్రసాద్, నర్సమ్మ దంపతులు ఆంధ్రప్రదేశ్‌లోని ఉరుకుంద ఈరన్న స్వామి దైవదర్శనానికి శుక్రవారం బైక్‌పై బయలుదేరారు. ఏపీలోని నాగలదిన్నె సమీపంలో గంగవరం స్టేజివద్ద గంగవరం నుంచి ట్రాక్టర్ అతివేగంతో వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ప్రసాద్, నర్సమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. అటువైపు వెళ్తున్న వారు అంబులెన్స్‌లో ఎమ్మిగనూరులోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం కర్నూలులోని ఆస్పత్రికి తరలించారు.

### ఇన్‌స్టాలో పరిచయం.. ఆపై ప్రేమ వివాహం

- అంతలోనే ఆత్మహత్య

కోస్గి: కులం, మతం, కనీసం ప్రాంతం తెలియకుండా ఇన్‌స్టాగ్రాం పరిచయమైన ఓ యువ జంట ప్రేమలో పడి పెద్దలకు తెలియకుండానే వివాహం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న అమ్మాయి తల్లిదండ్రులు యువకుడి గ్రామానికి వచ్చి పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి రాజీ చేసుకొని అమ్మాయిని తీసుకెళ్లారు. అయితే ఆ తర్వాత ఇరువర్గాల తల్లిదండ్రులకు తెలియకుండానే ప్రేమ జంట రహస్య కాపురం మొదలు పెట్టారు. ఓ పాప సైతం జన్మించింది. ఈ క్రమంలో ఏం జరిగిందో తెలియదు గాని శుక్రవారం యువతి అద్దె ఇంట్లోనే ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించిన స్థానికులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. మండలంలోని నాచారం గ్రామానికి చెందిన రాజు సొంత తుఫాన్ వాహనం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే గతేడాది ఇన్‌స్టాగ్రాంలో ఆత్మకూర్ మండలం దేవర్‌పల్లికి చెందిన యువతి రజిత(22) రాజుకు పరిచయమైంది. పరిచయం కాస్త ప్రేమగా మారడంతో పెద్దలకు తెలియకుండా పెళ్లి చేసుకున్నారు. ఈ క్రమంలో అమ్మాయి తల్లిదండ్రులు విషయం తెలుసుకొని నాచారం గ్రామానికి వచ్చి పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. అమ్మాయి తరపు వారికి డబ్బులు చెల్లించి రాజీ చేసుకొని అమ్మాయిని సొంత గ్రామానికి పంపించారు. ఇదిలా ఉండగా.. ఇరువర్గాల వారికి తెలియకుండా కోస్గిలోని బీసీకాలనీలో ప్రేమజంట రహస్య కాపురం పెట్టారు. వీరికి ఓ పాప జన్మించింది. రాజు ఎవరికి అనుమానం రాకుండా రోజు తన సొంత గ్రామానికి వెళ్తూనే తన రహస్య కాపురం కొనసాగించాడు. అయితే శుక్రవారం రజిత(22) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కాలనీవాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అలాగే రాజును అదుపులోకి తీసుకొని వివరాలు తెలుసుకొని అమ్మాయి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. యువతి ఆత్మహత్యతో ఆన్‌లైన్ ప్రేమ వ్యవహారం, రహస్య కాపురం వెలుగులోకి రావడంతో కాలనీవాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

# హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లు



మహబూబ్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

- తుది దశకు చేరిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ
- నేడు ముగియనున్న పోటీలు



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో పదో రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్–19) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్కంఠగా కొనసాగాయి. ముఖ్యంగా అకాడమీ క్రీడాకారుల మధ్య పోటీ రసవత్తరంగా సాగింది.

**మ్యాచ్ వివరాలు..**

సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్ మ్యాచ్‌లు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. బాలుర సింగిల్స్‌లో ఎం.అజయ్‌కార్తీక్ (జనగాం) 21–16, 21–16 వరుస సెట్ల తేడాతో ప్రణయ్‌శ్రీకర్ (నిజామాబాద్)పై, అక్షిత్ వలిశెట్టి (మెదక్) 21–17, 21–19 తేడాతో ఎస్.అఖిల్‌రావు (వరంగల్‌)పై, బాలికల సింగిల్స్‌లో శ్రేష్టరెడ్డి (హైదరాబాద్) 21–19, 21–17 తేడాతో ఎం.కీర్తి (జనగాం)పై, ప్రసన్నబోనం (ఖమ్మం) 21–13, 21–11 తేడాతో రిషితా పాండే (వరంగల్)పై గెలుపొందారు. డబుల్స్ బాలురలో ఎం.నవనీత్(రంగారెడ్డి)–వెంకట మౌనిష్ (మెదక్) 19–21, 21–13, 21–19 తేడాతో కె.అభిషేక్ (హైదరాబాద్), వర్షిత్ శ్రీసాయి (భద్రాద్రి కొత్తగూడెం)పై, అక్షిత్ వలిశెట్టి (మెదక్)–పి.జయేంశ్‌రెడ్డి (హైదరాబాద్) 21–19, 21–16 తేడాతో ఎస్.అఖిల్‌రావు (వరంగల్)–నిశాంత్ భూక్యా (నల్లగొండ)పై, బాలికల డబుల్స్‌లో అలీషాఖాన్ (రంగారెడ్డి)–శ్రేష్టారెడ్డి (హైదరాబాద్) 21–13, 21–15 తేడాతో సాయిశృతి–సమీక్షాయాదవ్ (హైదరాబాద్)పై, కె.సమీక్షారెడ్డి (హైదరాబాద్)–పూజిత నీలికంఠి (రంగారెడ్డి) 21–15, 11–21, 21–16 తేడాతో కొత్తనైనికరెడ్డి (సూర్యాపేట)–శిఖా (రంగారెడ్డి)పై విజయం సాధించారు. అదే విధంగా మిక్స్‌డ్ డబుల్స్‌లో ఇంటూరి వర్షిత్ శ్రీసాయి (భద్రాద్రి కొత్తగూడెం)–అలీషాఖాన్ (రంగారెడ్డి) 22–24, 21–17, 21–13 తేడాతో శౌర్యకిరణ్ (వరంగల్)–ప్రంజల నిసర్గ (రంగారెడ్డి)పై, ఎం.అజయ్‌కార్తీక్, కీర్తి (జనగాం) 16–21, 21–14, 21–18 తేడాతో ఎల్లోర కోనేర్ (రంగారెడ్డి)–సాయి రమణ్ అరంగి (వరంగల్)పై గెలుపొంది ఫైనల్‌కు చేరుకున్నారు.

**రెండు విభాగాల్లో ఫైనల్‌కు..**

ఈ టోర్నీలో రెండు విభాగాల్లోనూ వారే ఫైనల్‌కు చేరడం విశేషం. అజయ్‌కార్తీక్ మిక్స్‌డ్ డబుల్స్–సింగిల్స్‌లో, అలీషాఖాన్ డబుల్స్– మిక్స్‌డ్‌లో, శ్రేష్టరెడ్డి సింగిల్స్–డబుల్స్‌లో, అక్షిత్ వలిశెట్టి సింగిల్స్–డబుల్స్‌లో ఫైనల్‌కు చేరుకున్నారు.

**డీవైఎస్‌ఓకు ఘన సన్మానం**

స్టేడియంలో జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి ఎస్.శ్రీనివాస్‌కు మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానం చేశారు. రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహణకు జిల్లా క్రీడాశాఖ సహకారం ఎంతో ఉందని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎండీబీఏ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, రవికుమార్, కోశాధికారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర, జాతీయస్థాయి టోర్నీలకు



నేను 15 ఏళ్లపాటు బ్యాడ్మింటన్ టోర్నీలకు అంపైర్‌గా వ్యవహరించి తొలిసారిగా మహబూబ్‌నగర్‌లో టోర్నీకి బ్యాడ్మింటన్ అసోసియేషన ఆఫ్ తెలంగాణ రెఫరీగా అవకాశం ఇచ్చింది. మహబూబ్‌నగర్‌లోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం చాలా బాగుంది. జిల్లా స్థాయిలో ఇలాంటి ఇండోర్ స్టేడియం ఉండడం గొప్ప విషయం. ఈ స్టేడియంలో టోర్నీ నిర్వహణ బాగుంది. భవిష్యత్‌లో జాతీయస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీలు జరగడానికి అన్ని వసతులు స్టేడియంలో ఉన్నాయి.

– హన్మంతరావు, టోర్నీ రెఫరీ, జనగాం

### బ్యాడ్మింటన్ చాలా ఇష్టం



బ్యాడ్మింటన్ అంటే చాలా ఇష్టం. గోపిచంద్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నా. ఇక్కడ జరుగుతున్న అండర్–19 బ్యాడ్మింటన్ టోర్నీ సింగిల్స్‌లో ఫైనల్ వెళ్లినందుకు సంతోషంగా ఉంది. ఫైనల్‌లో మెరుగైన ప్రతిభ కనబరిచి ఛాంపియన్‌గా నిలుస్తా. గతంలో అండర్–19 డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో పతకాలు సాధించా.

– ఎం.అజయ్‌కార్తీక్, సింగిల్స్ ఫైనలిస్ట్

### ఫైనల్‌కు వచ్చినందుకు సంతోషం



రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ మిక్స్‌డ్ డబుల్స్‌లో ఫైనల్‌కు చేరినందుకు సంతోషంగా ఉంది. హైదరాబాద్‌లోని ఏ–జోన్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నా. గతేడాది జైపూర్‌లో జరిగిన ఆలిండియా ర్యాంకింగ్స్ టోర్నీలో పాల్గొన్నా. అంతర్జాతీయ స్థాయిలో దేశం తరపున ఆడాలన్నదే తన లక్ష్యం. మహబూబ్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆడుతున్నందుకు సంతోషంగా ఉంది.

– ఇంటూరి వర్షిత్‌శ్రీ సాయి, మిక్స్‌డ్ డబుల్స్ ఫైనలిస్ట్

### ముంబయి నుంచి హైదరాబాద్‌కు



మాది మహారాష్ట్ర. ముంబయిలో శిక్షణ తీసుకునేదాన్ని. ఏడాదిన్నర క్రితం ముంబాయి నుంచి హైదరాబాద్‌కు వచ్చి గోపిచంద్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నా. పలుసార్లు ఆలిండియా ర్యాంకింగ్స్ టోర్నీలో పాల్గొన్నా. భవిష్యత్‌లో ఇండియాకు ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా పెట్టుకున్నా.

– అలీషాఖాన్, మిక్స్‌డ్ డబుల్స్ ఫైనలిస్ట్

### మూడేళ్ల నుంచి శిక్షణ



మూడేళ్ల నుంచి జిల్లా కేంద్రంలో బ్యాడ్మింటన్ శిక్షణ తీసుకుంటున్నా. నాలుగు సార్లు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించా. తొలిసారిగా అండర్–19 టోర్నీలో పాల్గొంటున్నా. అకాడమీ క్రీడాకారులతో మ్యాచ్ ఆడడం కొత్త విషయాలను నేర్చుకునే అవకాశం లభించింది. ఈ టోర్నీ అనంతరం నా ఆటతీరును మరింతగా మెరుగుపరుచుకుని భవిష్యత్‌లో మంచి ప్రదర్శన కనబరుస్తాం.

– ఎస్‌జే.జోయెల్, మహబూబ్‌నగర్

# మార్మోగిన గోవింద నామస్మరణ



రాజ గోపురం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

- కురుమూర్తి గుట్టకు తరలివచ్చిన భక్తులు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన అమ్మపూరం కురుమూర్తి స్వామి దర్శనానికి అమావాస్యను పురస్కరించుకొని బుధవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఉదయం నుంచే తరలి వచ్చి క్యూలైన్లో నిల్చున్నారు. మెట్లపై దీపాలు వెలిగిస్తూ.. గోవింద నామస్మరణతో స్వామి చెంతకు చేరి కొబ్బరికాయలు కొట్టి దర్శించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా తయారు చేసి స్వామికి సమర్పించి వేడుకున్నారు. అనంతరం కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తులు దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణమంత భక్తుల రద్దీతో కనిపించింది. జాతర మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో స్వీట్లు, తదితర వస్తువులు కొనుగోలు చేశారు.



అన్న అభిషేకంలో బాలబ్రహ్మేశ్వరుడు

# అలంపూర్ క్షేత్రంలో ఆరుద్రోత్సవం



బాలబ్రహ్మేశ్వరుడి ఆలయంలో భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాల్లో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం ఆరుద్రోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధ్వజమండపం వద్ద ముందుగా కపిల గోవుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం చుట్టూ మంగళవాయిద్యాలు, వేదమంత్రాల మధ్య గో సహితంగా ఆలయ ప్రాకార మండప ప్రదక్షిణలు చేశారు. అనంతరం గణపతి పూజలు నిర్వహించి అక్కడ మహన్యాస పారాయణాలు చేశారు. గర్భగుడిలో కొలువుదీరిన బాలబ్రహ్మేశ్వరుడికి నమక, చమకాలతో ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి అన్నసూక్త పారాయణంతో అన్నాభిషేకాలు చేశారు. అలాగే బిల్వాష్టోత్తర అర్చనలు సహస్ర నామార్చనలు చేశారు. మహానివేదనలు సమర్పించి దశవిధ హారతులు అందజేశారు.

**జోగుళాంబ ఆలయంలో చండీహోమాలు**

అలంపూర్ జోగుళాంబ అమ్మవారి ఆలయంలోని యాగశాల మండపంలో శుక్రవారం నిర్వహించిన చండీహోమాలకు భక్తుల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 287 మంది చండీహోమాల్లో పాల్గొన్నట్లు ఆలయ అర్చకులు వేముల విక్రాంత్ శర్మ తెలిపారు. చండీహోమాల ద్వారా ఆలయానికి రూ.2.87 లక్షల ఆదాయం చేకూరినట్లు ఆలయ ఈఓ పురేందర్ కుమార్ తెలిపారు. దర్శనానికి వచ్చిన భక్తులకు బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో భోజన సౌకర్యలు కల్పించారు.

### రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడి వాహనంతో పోలీసులు

కొత్తకోట రూరల్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మదనాపురం మండలం నుంచి బొలెరో వాహనం అతివేగంగా వెళ్తుండగా ఆపి తనిఖీ చేయగా బియ్యం బస్తాలు ఉండటంతో అనుమానం వచ్చి వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. సివిల్ సప్లయ్ అధికారి నందకిశోర్ బస్తాల్లో గల బియ్యాన్ని పరిశీలించగా రేషన్ బియ్యం(పీడీఎస్)గా నిర్ధారించారు. వాహన డ్రైవర్ పరమేష్, బియ్యం వ్యాపారి, వాహన యజమాని వడ్డె శివపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### గొడ్డలితో దాడిచేసిన వ్యక్తి రిమాండ్

గోపాల్‌పేట: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి వైన్స్‌లో గొడ్డలితో దాడి చేసిన వ్యక్తి కృష్ణయ్యను శుక్రవారం పట్టుకుని రిమాండ్ చేసినట్లు గోపాల్‌పేట ఎస్‌ఐ హరిప్రసాద్ తెలియజేశారు. కుర్మయ్య సొంత తమ్ముడే నరికాడని సీసీ పుటేజీల్లో, ఇతర ఆధారాలు గుర్తించామని తెలిపారు. రెండెకరాల పొలం విషయంలో కొంత కాలంగా గొడవ జరుగోతందన్నారు. దీని కారణంగానే కృష్ణయ్య గొంగడి కప్పుకొని వెళ్లి, గోపాల్‌పేట కనకదుర్గ వైన్స్‌లో మద్యం తాగుతున్న తన సొంత అన్న కుర్మయ్యను నరికాడని తెలియజేశారు.

# అతివేగానికి నిండు ప్రాణం బలి

- బైక్‌ను ఢీకొట్టిన కారు, ఒకరి మృతి

కందుకూరు: బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన ఓ యువకుడు స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో విగతజీవిగా మారాడు. బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం లింగసానిపల్లికి చెందిన సంపంగి మల్లయ్య(33) కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటూ బాలాపూర్ చౌరస్తాలో రాయి పనులు చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో మండల పరిధిలో శ్రీశైలం రహదారిపై దెబ్బడగూడ గేట్ సమీపంలోని మయూరి పైపుల ఫ్యాక్టరీ వద్ద ఎదురుగా రాంగ్ రూట్‌లో అతివేగంగా వస్తున్న ఓ కారు మల్లయ్య బైక్‌తో పాటు వెనక వస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి రోడ్డు పక్కకు ఎగిరపడ్డ మల్లయ్య తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని బైక్ రెండు కార్ల మధ్య ఇరుక్కుపోయింది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ సైదులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

ఖిల్లాఘనపురం: మద్యం తాగి వాహనం నడిపిన ముగ్గురికి జైలుశిక్ష, మరొకరికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. శుక్రవారం అందరిని వనపర్తి రెండో అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చామని.. సోలీపురం గ్రామానికి చెందిన కృష్ణయ్య, పర్వతాపురం గ్రామానికి చెందిన చెన్నయ్య, టక్కరి శివకు రెండ్రోజుల జైలుశిక్ష, గద్వాలకు చెందిన కిష్టన్నకు రూ.వెయ్యి జరిమానా న్యాయమూర్తి విధించారన్నారు. తాగి వాహనం నడిపితే శిక్ష తప్పదని హెచ్చరించారు.

# పెద్దగుట్టపై గుండం పూడ్చివేత

- అరిష్టమంటున్న పట్టణవాసులు
- నేడు ధర్నాకు హిందూసంఘాల పిలుపు



పెద్దగుట్టపై ఉన్న గుండం



పూడ్చివేసిన తరువాత..

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పెద్దగుట్టపై ఉన్న పురాతన రంగనాయకస్వామి గుండాన్ని పూడ్చివేశారు. ప్రకృతి సిద్ధంగా పెద్దరాళ్ల మధ్య గుండం ఏర్పడింది. భూమికి 750 అడుగుల ఎత్తులో ఉన్న గుట్టపై ఏడాది పొడవునా నీళ్లుండేవి. సుమారు 700 ఏళ్లనాటిదని తెలుస్తోంది. అంతటి ప్రాశస్త్యం ఉన్న గుండాన్ని పూడ్చిన ఫొటోలు శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. గుట్టపై ఏం జరుగుతుందంటూ పోస్టులు చేస్తున్నారు. ఈ విషయంపై ఆలయ ధర్మకర్త రవితేజ మాట్లాడుతూ.. ఆలయాన్ని పెద్దగా నిర్మించబోతున్నామని, ఆగ్నేయంలో గుండం ఉండటం సరికాదని పూడ్చివేసినట్లు తెలిపారు. మరోచోట నిర్మాణం చేపడతామని బదులిచ్చారు. ఆగమశాస్త్రం ప్రకారం తొలగించామంటూ వీడియో ద్వారా సామాజిక మాధ్యమాల్లో వివరించే ప్రయత్నం చేశారు. దీనిపై హిందూసంఘాలు, పట్టణవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ అభివృద్ధికి ధర్మకర్తగా నియమిస్తే శతాబ్దాల చరిత్ర ఉన్న గుండాన్ని ఎందుకు పూడ్చారంటూ ప్రశ్నిస్తున్నారు. ఆ వార్డు కౌన్సిలర్ సుంకసారి రమేష్ సైతం గుండం పూడ్చివేత సరికాదని చెబుతున్నారు. మున్సిపాలిటీకి సమాచారం ఇవ్వకుండా ఎలా పూడ్చివేస్తారని ప్రశ్నిస్తున్నారు.

**నేడు ఆందోళన..**

గుండం పూడ్చివేతపై శనివారం ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ చౌరస్తాలో ఆందోళనకు హిందూ సంఘాలు పిలుపునిచ్చాయి. ధర్నా అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించి గుట్టను సందర్శించాలని నిర్ణయించారు. గుండం పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# నాగర్‌కర్నూల్‌లో రేపటి నుంచి ఆయుత చండీహోమం



యాగశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలో ఈ నెల 7న శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ నిర్వహించే ఆయుత చండీహోమం అతిరుద్ర యాగశాలను ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయుత చండీహోమం అతిరుద్ర యాగం విశిష్టతను శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఠాధిపతి మాట్లాడారు. ఈ నెల 21 వరకు ఆయుత చండీ హోమం కార్యక్రమాలు కొనసాగుతాయని, లక్ష కుంకుమార్చనతో పాటు లక్ష బిల్వార్చన, పదివేల పార్థివ లింగాల అర్చన కార్యక్రమాలు ఉంటాయని స్వామీజీ తెలియజేశారు.

### జాతీయ శిక్షణ శిబిరానికి ఎంపిక



జడ్చర్ల టౌన్: జాతీయ అథ్లెటిక్ శిక్షణ శిబిరానికి పట్టణానికి చెందిన లక్ష్యా అథ్లెటిక్ క్రీడాకారుడు జీవన్ ఎంపికైనట్లు పీడీలు మోయిన్, కిట్టు, కోచ్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఇటీవల గుజరాత్‌లో జాతీయ టోర్నీలో ప్రతిభ కనబరిచి శిక్షణకు ఎంపికైనట్లు చెప్పారు. భోపాల్‌లో 15రోజుల పాటు జాతీయ కోచ్‌ల చేత ప్రత్యేక శిక్షణలో మెళకువలు నేర్పిస్తారని తెలిపారు. జీవన్‌ను స్టేడియం మైదానంలో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్, క్రీడాకారులు పాల్గొన్నారు.

### జూరాలకు నిలిచిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టుకు ఎలాంటి ఇన్‌ఫ్లోలు లేదు. ఆవిరి రూపంలో 131, కోయిల్‌సాగర్‌కు 157, ఇతర అవసరాలకు 1,193 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టులో 7.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

### నల్లబెల్లం పట్టివేత



కల్వకుర్తిరూరల్: సారా తయారీ కోసం అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎల్లికల్‌తండాకు బెల్లాన్ని తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీ నిర్వహిస్తుండగా గుండియా నాయక్ 9 సంచుల్లో 180 కేజీల బెల్లాన్ని, నాలుగు లీటర్ల సారాతో పట్టుబడినట్లు సీఐ చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

DOCUMENT MISSING

ఎ.శ్రీనివాసులు తండ్రి ఎ.వెంకన్న, R/o H.No.1-5-107/A, జగ్జీవన్‌రాం నగర్, మహబూబ్‌నగర్ టౌన్ & జిల్లా. అను నా యొక్క ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్స్, Doc No.3494/2001, తేది:08-12-2022 ఈ డాక్యుమెంట్స్ మా ఇంటి నుండి న్యూటౌన్‌కు వెళ్తున్నప్పుడు మార్గమధ్యంలో పడిపోయినవి. కావున ఇట్టి డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికినచో ఈ క్రింది నంబరును సంప్రదించండి. సెల్:9014154288 [J-24249]

WANTED

ఒమేగా హోంకేర్ నందు వృద్ధులకు, పేషెంట్స్‌కు, పిల్లలను చూసుటకు ఇంటి పని/వంట పని చేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 20K. Ph: 8977638662, 8977638663 [H-789899]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి, మేనేజర్